క్లుప్తంగా

సిబ్బంది పనితీరుపై ఎంపీపీ ఆగ్రహం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు సిబ్బంది తీరుపై ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటించకుంటే ఇకపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి ప్రహరీ పెంచడం, శిథిలావస్థకు చేరిన భవనం కూల్చివేత, అదనపు భవనం నిర్మాణం కోసం కమిటీ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయిసౌమ్య, సంధ్య, పీహెచ్‌సీ సిబ్బంది, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు రవినాయక్ ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఉత్తమ చైర్మన్‌గా యాదగిరి


అవార్డు అందుకుంటున్న యాదగిరి

రామాయంపేట(మెదక్): లయన్స్‌క్లబ్ ద్వారా విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు క్లబ్ జిల్లా చైర్మన్ దేమె యాదగిరి ఉత్తమ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం నారాయణఖేడ్‌లో జరిగిన క్లబ్ సమావేశంలో రిజినల్ చైర్మన్ దిగంబరరావు ఆయనకు అవార్డును అందజేశారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన


కోనాపూర్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

రామాయంపేట(మెదక్): నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మండలంలోని కోనాపూర్‌లో సోమవారం పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి, నిరసన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తాము కుటుంబాలను పోషించుకోలేక అర్థాకలితో ఉంటున్నామని వారు వాపోయారు. వెంటనే తమ వేతనాలు విడుదల చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

మా భూములు మాకివ్వండి

పాపన్నపేట(మెదక్): తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలిచ్చి తమ కుటుంబాలకు రక్షణ కల్పించాలని చిత్రియాల్ తండా గిరిజనులు సోమవారం పాపన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిత్రియాల్ తండా శివారులో సర్వే నంబర్ 73లో చాలా ఏళ్లుగా పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. 1972లో రెవెన్యు సిబ్బంది సర్వే నిర్వహించి, హక్కులు కల్పించారని తెలిపారు. కొన్ని రోజులుగా అటవీ శాఖ అధికారులు ఆ భూములు తమవంటూ వేధిస్తున్నారని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి, తమ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ తహసీల్దార్ మధుకు వినతిపత్రం సమర్పించారు.

నేడు సైన్స్ ఫెయిర్


ప్రదర్శనకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

రేగోడ్(మెదక్): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రం రేగోడ్ మోడల్ స్కూల్ – జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న సైన్స్ ఫెయిర్‌కు ముఖ్యఅతిథిగా అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరు కానున్నారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ జయప్రకాశ్ సోమవారం తెలిపారు.

'మాణిక్‌రెడ్డిని గెలిపించండి'

నర్సాపూర్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నర్సాపూర్ మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పద్మారావు, జిల్లా కార్యదర్శులు రవి, సుధాకర్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

నర్సాపూర్‌రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువకులు సోమవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయపల్లి గోపి, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో యువకులు విశాల్, భాను, కిట్టు, నరేందర్, నరేశ్, గణేశ్ తదితరులు చేశారు. అనంతరం వారికి వాలీబాల్ కిట్‌ను గోపి అందించారు.

బాలల పరిరక్షణకు కృషి చేయాలి


కొల్చారం(నర్సాపూర్): మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల


శివ్వంపేట(నర్సాపూర్): మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వీసీపీసీ (విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ సెల్, గ్రామ బాలల పరిరక్షణ కమిటీ) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. బాలల హక్కులు కాపాడడంతో పాటు బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, వివిధ శాఖల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, నవీన తదితరులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు బాధ్యతయుతంగా పనిచేయాలని ఎంపీపీ మంజుల సూచించారు. సోమవారం ఐకేపీ సమావేశం మందిరంలో బాలల పరిరక్షణ కమిటీపై ఐసీడీస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, బడీడు పిల్లలను బడిలో చేర్పించడం తదితర హక్కులపై కమిటీల సమర్థంగా పనిచేయాలన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. బాలల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వీటిని ఉల్లంఘిస్తే వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ ఉమాదేవి, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ రమేశ్, ఎంఈఓ నీలకంఠం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ, సామాజిక కార్యకర్త శ్రీనివాస్‌గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్వేత, మండల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


వెల్దుర్తి(తూప్రాన్): గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులతో పీడీ, హెచ్‌ఎం


చిలప్‌చెడ్(నర్సాపూర్): వివేక్ వర్ధమాన్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): ఈ నెల 26న సిద్దిపేటలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు పీడీ ప్రతాప్‌సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 800 మంది పోటీలో పాల్గొనగా, ఉన్నత పాఠశాల నుంచి పాల్గొన్న 25 మంది విద్యార్థుల్లో 20 మంది గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. అవార్డులు అందుకున్న వారిని హెచ్‌ఎం సాంబయ్యతో పాటు గ్రామ పెద్దలు అభినందించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేట నవభారతి పాఠశాల ఆవరణలో కుంగ్‌ఫూలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి వివేక్ వర్ధమాన్‌గౌడ్‌ను సోమవారం హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆదివారం నర్సాపూర్‌లో జరిగిన నాల్గవ జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో కటాస్ విభాగంలో వివేక్ వర్ధమాన్‌గౌడ్ బంగారు పతకం సాధించాడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, దేవి, సమ్రీన్, గంగవేణి, శిరీష, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీని అందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల దుర్గయ్యకు రూ.2 లక్షల 50 వేల ఎల్‌ఓసీ చెక్కును నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే దుర్గయ్య కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దుర్గేష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప కల్యాణం


పూజలు నిర్వహిస్తున్న సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్‌లో రెండు రోజులుగా బీరప్ప స్వామి కామరతి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాలను గొల్ల కురుమల పూజారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆమె వెంట సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ మంజుల, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, ఎనగండ్ల సర్పంచ్ వీరారెడ్డి, నాయకులు వెంకట్ గౌడ్, మహేందర్ రెడ్డి, మల్లాగౌడ్, రవితేజ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా గీతా మందిర వార్షికోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

తూప్రాన్: పట్టణంలోని గీతా మందిరంలో పంచదశ(15) వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు ఆలయ గీతా భక్త సమాజం సభ్యులు తెలిపారు. ఈ వేడుకలకు రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీ స్వామి హాజరై పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం వేద స్వస్తి, శ్రీవిఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పంచగవ్య మేళన, ప్రధాన కలశ స్థాపన, గణపతి హోమం, 8 గంటలకు మహా మంగళ హారతి, మంత్రపుష్పం, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

'గౌడ కులస్తులకు అండగా ఉంటా'


శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందిస్తున్న గౌడ సంఘాల నాయకులు

నర్సాపూర్: రాష్ట్రంలోని గౌడ కులస్తులకు అండగా ఉంటానని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములుగౌడ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని గౌడ కులస్తులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కాగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన శ్రీనివాస్‌గౌడ్‌ను పలువురు గౌడ సంఘాల నాయకులు అభినందించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో వచ్చే నెల 6న నిర్వహిస్తున్న బీరప్ప జాతరకు రావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి నిర్వాహకులు ఆహ్వాన పత్రికను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు, ఉప సర్పంచ్ నవీన్, ఆత్మకమిటీ డైరెక్టర్ రాంచంద్రంగౌడ్ తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలకు కృషి


సమస్యలపై చర్చిస్తున్న సర్పంచ్, కార్యదర్శి, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామస్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని సర్పంచ్ మాంతప్ప, కార్యదర్శి యాదగిరి అన్నారు. సోమవారం మండలంలోని జగ్గంపేట గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, కార్యదర్శులతో పాటు గ్రామ పెద్దలు కలసి పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, ఉపాధిహామీ పనుల గురించి చర్చించారు. పలువురు ఉపాధి హామీ కూలీలు తమకు ఉపాధి హామీ డబ్బులు రావడంలేదని గ్రామసభలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు యాదగౌడ్, రేణుక, రవి, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్ షహనాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బదిలీలు సహజం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని పేట ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట ఎంపీఓ రియాజుద్దీన్ బదిలీపై టేక్మాల్ మండలానికి వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీఓను ఎంపీపీ, ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నీసాతో పాటు గ్రామకార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో నూతన ఎంపీఓ విఠల్‌రెడ్డి, సూపరింటెండెంట్ శాకీర్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, కో ఆప్షన్ యాదుల్, ఏపీఓ సుధాకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక తనపై బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని సికింద్లాపూర్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం బీజేపీ నాయకుడు సింగాయపల్లి గోపి గ్రామంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా తను భూ అక్రమాలకు పాల్పడినట్లు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. సికింద్లాపూర్ ఆలయ భూములను కాపాడేందుకు రెవెన్యూ, దేవాదాయ శాఖ సిబ్బందితో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేసిన విషయం గుర్తుచేశారు.

◆ వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో సోమవారం ఎల్లమ్మ ఆలయంలో గౌడ కులస్తులు రేణుకా జమదగ్ని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు, గ్రామ గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

◆ ఉపాధిహామీ పనులు ప్రారంభం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని కంటయ్య కుంటలో సోమవారం సర్పంచ్ అనూష, ఎంపీటీసీ లహరిరెడ్డి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 రోజుల పని దినాల్లో భాగంగా గ్రూపుల వారీగా ఉపాధి హామీ పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు, గ్రామ కార్యదర్శి నర్సింలు, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, బీఆర్‌ఎస్ నాయకులు కిష్టా రెడ్డి, లక్ష్మీనర్సింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ బోరుమోటార్ ప్రారంభం

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో ఇటీవల వేసిన బోర్ మోటార్‌ను సోమవారం గ్రామ నాయకులతో కలసి జెడ్పీటీసీ సరోజ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగయ్య, ఎంపీటీసీ భూమయ్య, ఉపసర్పంచ్ ఖలీల్, మాజీ సర్పంచ్ నాగయ్య, కొట్టి నారాయణ, కొండ రవి, నాయకులు చిన్న మల్లేశం, ఎల్లయ్య, కొట్టి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుకారం గౌడ్, ఉప అధ్యక్షుడు సంగమేష్, వార్డు మెంబర్లు లక్ష్మయ్య, శ్రీను, కేశబోయిన రాజయ్య, చాకలి బాగయ్య, సాయిలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

◆ పది ప్రత్యేక తరగతుల పరిశీలన

కొల్చారం(నర్సాపూర్): కొంగోడ్, అంసాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు చేపట్టిన ప్రత్యేక తరగతులను సోమవారం మండల విద్యాధికారి నీలకంఠం పరిశీలించారు.

◆ విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

పాపన్నపేట(మెదక్): పాపన్నపేటలోని పెద్ద హరిజన వాడ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓగా దుర్గాప్రసాద్, ఎంఈఓగా హరీశ్, హెచ్‌ఎంగా ప్రజ్ఞాన్, టీచర్లుగా రక్షణ్ కుమార్, తరుణ్, భవానీ, జయశ్రీ, అఖిల, దివ్యదర్శిని, అరుణ విధులు నిర్వర్తించారు. పాఠశాల హెచ్‌ఎం ఫసియొద్దీన్, రవీందర్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టాలను అమలు చేయాలి


నర్సాపూర్: జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్: రాష్ట్రంలో ర్యాగింగ్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నర్సాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పలు కాలేజీలకు చెందిన విద్యార్థులతో ర్యాలీ చేపట్టి, జాతీయ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో విద్యార్థిని ప్రీతిపై ర్యాగింగ్‌కు పాల్పడిన సైఫ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ చట్టాలను కఠినంగా అమలు చేస్తే ఎక్కడ ర్యాగింగ్ ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు ఆకాశ్, ఇతర ప్రతినిధులు ప్రకాశ్, మహేందర్, ఉమేశ్, సాయి కిరణ్, షోహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ..

మెడికో విద్యార్థి ప్రీతి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సోమవారం నర్సాపూర్‌లో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆయా కాలేజీల విద్యార్థులు స్థానిక చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నర్సాపూర్ డివిజన్ జాయింట్ సెక్రెటరీ అక్షయ్‌గౌడ్ మాట్లాడుతూ.. మెడికో ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ర్యాగింగ్ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అక్షయ్‌గౌడ్, నాయకులు రాహుల్‌గౌడ్, సుజిత్‌రెడ్డి, వరుణ్, మనో, రంజిత్, నందు, కన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మెడికల్ పీజీ విద్యార్థిని ప్రీతి మరణంపై జ్యుడీషియల్ న్యాయ విచారణ జరిపించాలని ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థిని, విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు యాదగిరి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు, మైనారిటీ నాయకులు మక్సూద్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ర్యాగింగ్‌కు బలైన మెడికో ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ రాథోడ్ మాట్లాడుతూ.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సుభాష్, సర్దార్ నాయక్ తదితరులున్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత


జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. రూ.15లక్షల జెడ్పీ నిధులతో మండల కేంద్రంలో నిర్మించిన యాదవ సంఘ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ కులస్తులు జెడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీత, వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహేశ్, ఎంపీటీసీ లత, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో భవనం నిర్మిస్తా

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చేగుంట(తూప్రాన్): అసంపూర్తిగా ఉన్న మహిళా సంఘ భవనంతో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను సొంత డబ్బులతో నిర్మిస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం ప్రజాగోస బీజేపీ యాత్రలో భాగంగా బీజేపీ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతసాగర్ గ్రామంలో అసంపూర్తి భవనాలను తన సొంత డబ్బులతో వంద రోజుల్లో నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు సైతం అర్హులందరికీ డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలోని పలు వార్డుల్లో తిరిగి మహిళలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, మాజీ సర్పంచ్‌లు బాల్‌చందర్, రఘువీర్, గ్రామశాఖ అధ్యక్షులు బాగులు, కుమ్మరి సత్యం, గ్రామ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదవాలి


స్టడీమెటీరియల్ అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): మెరుగైన ఫలితాల కోసం పదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదవాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని సూరారం గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ యాదగిరి, సర్పంచ్ నీరజగౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఇదేం హాస్టల్

- 56 మందికి ఉన్నది ఆరుగురే..
- విద్యార్థినులే వంట మనుషులు
- పర్యవేక్షించని అధికారులు
- ఇదీ అల్లాదుర్గం బీసీ బాలికల హాస్టల్ దుస్థితి


అల్లాదుర్గం బీసీ బాలికల హాస్టల్‌లో ఉన్న ఆరుగురు బాలికలు

అల్లాదుర్గం(మెదక్): బీసీ బాలికల హాస్టల్ రికార్డులో 56 మంది ఉన్నారు. కానీ హాస్టల్‌లో ఉండేది ఆరుగురే. వంట మనిషి తమ బంధువులు మృతి చెందడంతో విధులకు రాలేదు. మరొకరిని ఏర్పాటు చేయాల్సిన వార్డెన్ పట్టించుకోక పోవడంతో విద్యార్థినులే వంటలు చేసుకుంటున్నారు. స్థానికంగా ఉండాల్సిన వార్డెన్ సొంత గ్రామంలో ఉంటూ వెళ్తున్నారు. బీసీ బాలికల హాస్టల్ ఇంత దారుణంగా కొనసాగుతుంటే జిల్లా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇది మండల కేంద్రమైన అల్లాదుర్గం బీసీ బాలికల హాస్టల్ దుస్థితి. సోమవారం సాయంత్రం ‘సాక్షి’ హాస్టల్‌కు వెళ్లడంతో పలు ఆసక్తికరమైన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. అల్లాదుర్గం బీసీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ హాస్టల్‌లో 56 మంది బాలికలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కొంత కాలంగా సక్రమంగా భోజనం పెట్టక పోవడంతో స్థానిక విద్యార్థినులు హాస్టల్‌కు రావడం లేదు. సోమవారం కేవలం ఆరుగురు బాలికలు మాత్రమే ఉన్నారు. ఏడు గంటలు కావస్తున్నా.. వంట చేసే వారే లేరు. పక్కింటి వారికి వంటలు చేయమని వార్డెన్ చెప్పి వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం చికెన్ కూర బాలికలే చేసుకొని భోజనం చేశారు. వంటమనిషి రాలేని పరిస్థితుల్లో ఉంటే మరొకరిని ఏర్పాటు చేసి వంటలు చేయించాల్సిన బాధ్యత వార్డెన్‌ది. కానీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. వసతిగృహంలో ఉన్న విద్యార్థినులు కూడా హాస్టల్‌లో తినడం లేదని చెప్పారు. 56 మందికి ఆరుగురు మాత్రమే ఉంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ఈ సంఘటనపై కలెక్టర్ స్పందించి, విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేస్తా

బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఈ సంఘటనపై బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి కేశవ్‌రామ్‌ను వివరణ కోరగా.. వార్డెన్‌తో మాట్లాడి తెలుసుకుంటానని చెప్పారు. పూర్తి స్థాయి విచారణ చేస్తామని చెప్పారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థినులకు కంటి వెలుగులో భాగంగా సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి శిబిరంలో సిబ్బంది పరీక్షలు చేశారు. మొదటిరోజు 40 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.